క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం తయారు చేసి వడ్డించాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ సూచించారు. బి.వి.సుబ్బారెడ్డి ఎలిమెంటరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం అమలు తీరును ఆమె బుధవారం పరిశీలించారు. విద్యార్థులు అందరూ మధ్యాహ్న భోజనం చేసేలా రుచికరంగా వంటలు వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో చలో ఢిల్లీకి శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎంజీ రోడ్డులోని ఆర్అండ్‌బీ బంగ్లాలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా ఆ సంఘ ప్రతినిధులు ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్, వేముల బేబీరాణి, మహీధర్, అజయ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార దాతలకు సత్కారం



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో క్షయ రోగులకు టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా నిక్షయ మిత్ర పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా ఆరు నెలల పోషకాహారం అందజేస్తున్న దాతలను సత్కరించారు. అందులో భాగంగా బుధవారం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, డీఎల్ఏటీఓ డాక్టర్ జె.ఉషారాణి ఆధ్వర్యంలో దాతలను సత్కరించారు. నిక్షయ మిత్ర కార్యక్రమంలో భాగస్వాములైన హెల్త్ సూపర్‌వైజర్ అనుమోలు వీరభద్రరావు, హెల్త్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, వాసవ్య మహిళా మండలి, అపోలో టైర్స్ హెల్త్ కేర్ వారిని దాతలుగా ప్రోత్సహిస్తూ సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అమృత, ప్రభుత్వాస్పత్రి డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభ, టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ పద్మావతి, డీపీఎంఓ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ ఏడాది అక్టోబర్ 22 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు సౌత్ కొరియాలోని ఛాంగ్‌వాన్ సిటీలో జరుగనున్న ఏషియన్ షూటింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలకు విజయవాడకు చెందిన మద్దినేని ఉమామహేష్ ఎంపిక అయ్యాడని రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు తొట్టెంపూడి షాలలిత్, కార్యదర్శి డి.రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియా నుంచి 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ విభాగంలో వ్యక్తిగత, మిక్స్‌డ్, టీమ్ విభాగాల్లో ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణేశ్వరరావు ఉమామహేష్‌ను అభినందించారు. ప్రస్తుతం ఉమామహేష్ ఢిల్లీలో శిక్షణ పొందుతున్నాడని, వచ్చే నెల 10వ తేదీన సౌత్ కొరియాకు బయలుదేరి వెళతారని చెప్పారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

పాయకాపురం(విజయవాడరూరల్): పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాంతీయ ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్లు సత్యప్రశాంత్, నందిని సూచించారు. జాతీయ పోషకాహార మాసంలో భాగంగా ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ పాయకాపురంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య పరంగా కలిగే ప్రయోజనాలను డాక్టర్లు వివరించారు. పోషకాహారం ప్రాముఖ్యతను తెలియజేస్తూ నెల రోజులపాటు సంస్థ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.

రెడ్‌కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో రెడ్‌కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను బుధవారం నిర్వాహకులు ఆర్.కె.నాయుడు, శైలజా రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర ప్రజల నుంచి ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన వస్తోందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో క్లాతింగ్, జ్యూయలరీ, హోమ్‌డెకార్స్‌కు సంబంధించి 40 స్టాల్స్ ఉన్నాయన్నారు. గురువారం రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అర్హతే ప్రామాణికంగా నూతన పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. మధురానగర్ సాయిబాబా కాలనీలో స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఆయన కొత్త పింఛన్‌లను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో ఒక్క కొత్త పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో సెంట్రల్ నియోజకవర్గంలో 17 వేల పింఛన్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 26,118 మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరించారు. 1,458 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో నియోజకవర్గంలో పింఛన్ల సంఖ్య 27,576కి చేరిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. పిల్లి కృష్ణవేణి, కంభం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అందులో భాగంగా అర్హులకు రేషన్‌కార్డులు, ఫించన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. 24వ డివిజన్‌లో కొత్తగా 23 మందికి రేషన్ కార్డులు, మరో 23 మందికి ఫించన్లు మంజూరయ్యాయి. వాటిని బుధవారం కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కుక్కల రమేష్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా పింఛన్లు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. 27వ డివిజన్‌లో కొత్తగా పింఛన్లు మంజూరైన 42 మందికి నగదు పంపిణీచేశారు. సచివాలయం కార్యదర్శులు పి.ఆనంద్, ఖాసింబి, గౌరీ, వైఎస్సార్ సీపీ నాయకులు కొండాయగుంట రాము, పి.నాగశ్రీ, డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, గుర్రం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. 32వ డివిజన్ రామకృష్ణాపురంలో నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు కార్పొరేటర్ బి.హెచ్.ఎస్.వి. జానారెడ్డి చేతుల మీదుగా నగదు అందజేశారు



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారికి రేషన్‌కార్డు అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ కుక్కల అనిత

62వ డివిజన్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులు అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి భరోసా ఇచ్చారు. డివిజన్ పరిధిలోని 268, 269, 270, 271 సచివాలయాల్లో కొత్తగా పింఛన్లు మంజూరైన 49 మందికి పార్టీ నాయకులు, సచివాలయాల సిబ్బందితో కలిసి విజయలక్ష్మి నగదు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కె.వీరబాబు, అలంపూరు విజయ్, రామిరెడ్డి, బోరా బుజ్జి, మహేష్, హైమావతి, సుభాన్, వీరంకి నాగేశ్వరరావు, సావిత్రి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అర్హతే కొలమానంగా కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి పేర్కొన్నారు. డివిజన్‌లో 60 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి శర్వాణీమూర్తి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాయంలో డివిజన్‌లో 482 పింఛన్లు ఉండగా, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వాటి సంఖ్య 1500లకు పెరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది విలియమ్స్, రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు శనగవరపు శ్రీనివాసరావు, నాదెండ్ల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పింఛన్లు

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి పేర్కొన్నారు. డివిజన్‌లో కొత్తగా పింఛన్లు మంజూరైన 36 మందికి బుధవారం నగదు పంపిణీచేశారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా పింఛన్లు రాకపోతే మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని రమాదేవి సూచించారు. పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ ముత్యాలంపాడులో బుధవారం సాయంత్రం కార్పొరేటర్ పెనుమత్స శిరీష నూతనంగా మంజూరైన 11 మందికి పింఛన్‌లను వార్డు సచివాలయం సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. వెఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం పాల్గొన్నారు. అయోధ్యనగర్‌లో పలువురికి కొత్త పింఛన్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుండే సుందర్‌పాల్, పేరం త్రివేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



31వ డివిజన్‌లో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష



పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి



పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ శర్వాణీమూర్తి



పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి

అగ్రిగోల్డ్ చలో విజయవాడకు అనుమతి లేదు

డీసీపీ విశాల్‌గున్ని

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నగరంలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 నిషేధాజ్ఞలు అమలులో ఉన్నందున అగ్రిగోల్డ్ కస్టమర్స్–ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన నగరంలోని జింఖానాగ్రౌండ్‌లో తలపెట్టిన శంఖారావ దీక్షకు ఎటువంటి అనుమతులు లేవని డీసీపీ విశాల్‌గున్ని పేర్కొన్నారు. ఈ మేరకు కమాండ్ కంట్రోల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరైతే నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తారో వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమకు అందిన ముందస్తు సమాచారం ప్రకారం కొంతమంది బయటి వ్యక్తులు ఈ ధర్నాలో పాల్గొని హింసకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగటంతో శాంతి భద్రతల దృష్ట్యా నగరంలో రెండు వేల మంది పోలీస్ సిబ్బంది, సీసీ, డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా నిఘా పెట్టి, పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తామన్నారు. నేటి నుంచి విజయవాడ వైపు వచ్చే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఏడీసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి..

ఈ నెల 18న జరగనున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నగరంలో పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని సూచించారు. ఉత్సవాలకు సమయం తక్కువ ఉండటంతో మునిసిపల్, పంచాయతీ, ఫైర్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రిసిటీ, పోలీసు శాఖలు అనుమతుల కోసం ఆయా శాఖల వద్దకు వెళ్లడం కష్టతరంగా ఉంటుందన్నారు. దీంతో పోలీస్ శాఖ అన్ని శాఖల అధికారులతో చర్చించి అన్ని శాఖలు ఒకే ప్రదేశంలో అనుమతులకు అర్జీలను ఇవ్వడానికి, అనుమతులు పొందడానికి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. నిర్వాహకులు అనుమతుల కోసం ఎంజీ రోడ్డులోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియానికి ఎదురుగా ఉన్న కమాండ్ కంట్రోల్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమీకృత పోలీస్ సేవా కేంద్రం (యూపీఎస్సీ)లో అన్ని వివరాలతో కూడిన దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఆయా దరఖాస్తులను అధికారులు పూర్తిగా పరిశీలించిన మీదట అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ నెల 14 నుంచి ప్రతిరోజూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సేవా కేంద్రం పని చేస్తుందని డీసీపీ తెలిపారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మాట్లాడుతున్న డీసీపీ విశాల్‌గున్ని

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్, 282వ సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనుంది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకుంటారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ తదితరులు పాల్గొంటారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరపాలక సంస్థ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణను బుధవారం ప్రారంభించారు. భవానీపురం 42వ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పీఓ కె.శకుంతలతో కలిసి కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ శిక్షణ ఆరు నెలల పాటు కొనసాగుతుందన్నారు. రోజూ నాలుగు గంటల చొప్పున శిక్షణఇ స్తారని తెలిపారు. 30 మంది మహిళలు శిక్షణలో పాల్గొంటారన్నారు. సిబ్బంది దుర్గాప్రసాద్, రమ్యకృష్ణ, రమ్య పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదమే బలం

– ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విలువలు, విశ్వసనీయతకు నిలువుటద్దం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలకు మాటిస్తే కచ్చితంగా నెరవేరుస్తారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ 207వ వార్డు సచివాలయ పరిధిలో స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రజలతో మమేకమై, వారికి ప్రభుత్వం నుంచి జరిగిన లబ్ధిని వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ఎమ్మెల్యే విష్ణు ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి బలమని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉన్నామనే నమ్మకాన్ని నాలుగేళ్లలో ప్రభుత్వం కల్పించిందని మల్లాది విష్ణు అన్నారు. ఈ సందర్భంగా పలువురికి నూతనంగా మంజూరైన తెల్ల రేషన్ కార్డులను అందజేశారు. దళారులు లేకుండా, అవినీతిరహిత పాలన అందిస్తుండటంతో ఇతర రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై అనవసర రాద్ధాంతం

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. అవినీతికి పాల్పడే వ్యక్తి ఏ స్థాయి వాడైనా శిక్షార్హుడే అన్న విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు అడ్డగోలుగా ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా లూటీ చేసినట్లు ఆధారాలతో నిరూపితమైందని పేర్కొన్నారు. కనుకనే చంద్రబాబుకు ప్రజల్లో సానుభూతి రావడంలేదన్నారు. బాబుది అక్రమ అరెస్ట్ అంటూ బాలకృష్ణ ఏవిధంగా మాట్లాడతారని ప్రశ్నించారు. ఏనాడూ హిందూపురం వైపు తొంగిచూడని బాలకృష్ణ, తన బావ కోసం మాత్రం షూటింగ్‌లు వదిలేసి ఆగమేఘాలపై వచ్చి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు. ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించేసి, ఘోరంగా అవమానించినప్పుడు కనీసం ఒక్క మాట అయినా మాట్లాడారా? అని బాలకృష్ణను సూటిగా ప్రశ్నించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో బాబుకు పూర్తి భద్రత ఉందని, ఆయన కోరిన రీతిలో అన్ని వసతులూ కల్పించారని తెలిపారు. రాజకీయం కోసం భద్రత లేదంటూ దుష్ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. డీఈ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నగర మహిళ అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, గోవింద్, ఎస్. గోవింద్, హరిబాబు, సుధాకర్, పూర్ణిమ పాల్గొన్నారు.



బోచర్‌ను అందజేస్తున్న మల్లాది విష్ణు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



విద్యుత్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

- 136 కేసులు నమోదు
- రూ.6.18 లక్షల జరిమానా
- విద్యుత్ చౌర్యం చేస్తున్న వారికి నోటీసుల జారీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని సూర్యారావుపేట సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు బుధవారం 47 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై 136 కేసులు నమోదు చేసి రూ.6.18 లక్షల అపరాధ రుసుం విధించారు. దుర్గ అగ్రహారం, సీతారామపురం, చుట్టుగుంట, మారుతీనగర్, మాచవరం, సూర్యారావుపేట, కస్తూరిబాయిపేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. అధికంగా వినియోగిస్తున్న, విద్యుత్ చౌర్యం చేస్తున్న సర్వీసులను గుర్తించి నోటీసులు జారీచేశారు. తనిఖీలకు ముందు చుట్టుగుంటలోని టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఈఈ బి.వి.సుధాకర్ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్‌ను ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా పంపిణీ చేసేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్లను తనిఖీ చేయటంతో పాటు అవసరమైన మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. వినియోగదారులతో సఖ్యతగా, గౌరవంగా మెలగాలని, వారి సూచనలను అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని స్పష్టంచేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విజిలెన్స్ ఈఈ కమలకుమారి మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ చౌర్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. గృహావసరాల కనెక్షన్‌లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ ఏడీఈ బి.నవీన్ కుమార్, ఏడీఈ పి.శ్రీధర్, సూర్యారావుపేట ఏఈ బి.వెంకట్రావు, విజిలెన్స్ ఏఈలు, టౌన్ డివిజన్ ఏడీఈలు, ఏఈలు, విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్, విజిలెన్స్ పోలీసులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

16న ఏకేటీపీ స్కూల్‌లో మెగా వైద్య శిబిరం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శర్వాణి లేబొరేటరీ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మునిసిపల్ హైస్కూల్‌లో ఈ నెల 16వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని సంస్థ అధినేత, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి తెలిపారు. ఈ మేరకు డివిజన్‌లోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కుందా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కుందా శ్రీధర్, డాక్టర్ ఎం.వి.సాయిరామ్, డాక్టర్ అనీల పసుమర్తి, డాక్టర్ గుడిపాటి ప్రదీప్ తదితర వైద్యులు పాల్గొని గుండె సంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలు, షుగర్, బీపీ, స్త్రీల సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్లు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. శిబిరానికి హాజరయ్యేవారు సత్యనారాయణపురం, గిరి వీధిలోని తన కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు శనగవరపు శ్రీనివాస్, కె.మారుతి, బాబు, నాదెండ్ల రవిశంకర్ పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై సంతృప్తి

పాయకాపురం(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య సేవా పథకాలను కేంద్ర బృందం కండ్రికలో బుధవారం పర్యటించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధానమంత్రి మాతృవందన యోజన, జననీ సురక్ష, ఆరోగ్య ఆసరా పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం గురించి ఆరుగురు సభ్యులతో కూడిన బృందం ఇంటికి ఒక్కరు చొప్పున వెళ్లి ఆరాతీశారు. ఈ సందర్భంలో ఆయా ఇళ్లవారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, డీపీహెచ్ఎన్ఓ లిథియా, ఎస్. లక్ష్మీజీ, డాక్టర్ షేక్ బాసిద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కండ్రిక హెల్త్ సెంటర్ వద్ద వైద్య సిబ్బందితో కేంద్ర బృందం

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఆత్రేయ

విజయవాడ కల్చరల్: ఆచార్య ఆత్రేయ బహుముఖ ప్రతిభాశాలి అని డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో కవి, నాటక, సినీ గేయ రచయిత ఆత్రేయ వర్ధంతి కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నరసింహారావు ప్రారంభించి ప్రసంగించారు. ఆత్రేయ సినిమా మాటలే కాదని అనేక నాటికలు రచించారని తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, ప్రసూన రామన్ పాల్గొన్నారు. ఆత్రేయ రచించిన సినీ గీతాలను సీనియర్ గాయకులు సత్యవర్ధన్, రసూల్‌బాబు, జయప్రభ, వాసిరెడ్డి శ్రీనివాస్, మధుబాబు, భారతి, విష్ణుప్రియ, సువర్ణలక్ష్మి, విజయశ్రీ గుప్తా మధురంగా ఆలపించారు. గాయని వద్దాది కామేశ్వరి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

హరికథా సంప్రదాయానికి పూర్వవైభవం రావాలి

విజయవాడకల్చరల్: హరికథా వైభవానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరముందని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159 జయంతి సందర్భంగా శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న జయంతి వేడుకలు, హరికథా ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ హరికథ అని ఆదిభట్ల నారాయణదాసు లాంటి దాసవరేణ్యులు హరికథను జాతీయ స్థాయికి తీసుకువెళ్లారన్నారు. శ్రీ కోట కళాపీఠం కార్యదర్శి కోట శివశాస్త్రి మాట్లాడుతూ హరికథా భాగవతులకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. వివిధ రంగాలకు చెందిన, జాగర్లమూడి వెంకట కృష్ణయ్య, సుధారాణి, బుర్రా పద్మనాభశాస్త్రి, యనమండ్ర వెంకటకృష్ణయ్య, అమ్ముల ప్రసాద్, తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, సినీ నటి కరాటే కల్యాణి హరికథా వైభవం అంశంగా ప్రసంగించారు. హరికథా గానంలో భాగంగా తిరుపతికి చెందిన వై వేంకటేశ్వర్లు గజేంద్రమోక్షం, నెల్లూరుకు చెందిన పరాయితం నారాయణా చార్యులు భక్త పురందర దాసు, రాజమండ్రికి చెందిన పురాణం విజయలక్ష్మి రుక్మిణి కల్యాణం గానం చేశారు. హరికథా భాగవతులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ప్రకటన

[illegible]

విజయవాడ, తేది: 12-09-2023

ఇట్లు : [illegible] #24-25-73, 2nd క్రాస్ రోడ్, [illegible], విజయవాడ - 3. Cell: 9849077779